

# సిగ్నల్

ఆదూరి వెంకట సీతారామమూర్తి

జెర్రిపోతులాంటి ఒక మెయిలూ; కోడె నాగులాంటి ఒక పాసింజరూ అటు పల్లెకూ యిటు పట్నానికీ మధ్యస్థంగా వుండే ఆ వూరికి ఆరు ఫర్లాంగుల దూరంలో వున్న ఆ రైలుస్టేషన్ ప్లాట్ఫారానికి అటూ యిటూ సొమ్మసిల్లినట్లు పడివుండి అప్పటికి గంటయింది.

చచ్చేయో బతికున్నాయో తెలియక మూగిన చీమల్లా చుట్టూ జనం.

తూరుపు కొండ మీంచి వెలుగు

వంశీ బర్కిలి-80 కథానికల పోటీలో ప్రథమస్థానం పొందినది కథ

పాలను పంచుతూన్న సూర్యుడు కణకణలాడుతూన్నాడు.

స్టేషన్‌కి కాస్త దూరంలో వున్న సూరీడి టీకొట్లో మరుగుతున్న పాల క్రింది నిప్పులూ రాజుకుని కణకణలాడుతున్నాయి.

పాకచుట్టూ జనం! అదొక్కటే మరి అక్కడ కేఫ్టీరియా- సూరీడి రెండు చేతులూ రెండువందల్లా చకచకా పన్జేస్తున్నాయి- మరుగుతున్న నీటిలో టీపొడి వేసి వడగడుతున్నాడు. పాలూ పంచదారా వేసి గజంన్నర సాగదీసి, టీ తేరిపి, గ్లాసులు నింపుతున్నాడు- గ్లాసులందించి డబ్బు లందుకుంటున్నాడు.

చుక్కమ్మ చేతులు రెండూ రెండు వేలై పనిచేస్తున్నాయి- అట్లకోసం పప్పు రుబ్బడం; ఇడ్లీవాయను పొయ్యిమీద వెయ్యడం; ఈలోగా వాటిల్లోకి చట్నీ అమర్చడం-

“ఇదిగో అబ్బాయ్. టిఫినేమైనా వుందా?” అడుగుతున్నాడు ఆసామీ- అతని చంకలోని మూడేళ్ళ కుర్రాడితో పాటు అతని చెయ్యి పట్టుకొచ్చిన మరో యిద్దరు పిల్లలుకూడ సూరీడు వేపు ఆశగా చూశారు.

సూరీడు తలెత్తి చూసే స్థితిలో లేడు-

“లేదు బాబూ. మరో పావుగంటలో తయారౌద్ది. అందాకా టీ వుంది.” అన్నాడు తలెత్తకుండానే-

చూస్తుండగానే సూరీడి కొట్టుముందు క్యూ బయల్దేరింది- ముఖాలు వేలాడేసి పెద్దలూ, ఏడుపులతో పిల్లలూ-

సూరీడు కలిపిచ్చేవి నీళ్ళో, పాలో, టీయో కూడా తెలియకుండానే ఆ కాసిన్నీ నోట్లో పోసుకుని డబ్బులిచ్చి పోతున్నారు.

“పోనీ ఆ టీలే రెండు గ్లాసులియ్యి.” డబ్బులిచ్చాడతను-పావుగంట గడిచింది. అట్లూ యిడ్లీలూ చూస్తుండగానే చెల్లిపోయాయి.

టీలు తాగి, తాపీగా సిగరెట్లో చుట్టలో శక్తానుసారం ముట్టించుకుని రైలుబళ్ళు ఆగిపోడం గురించి అప్పుడు చర్చించుకోడం మొదలుపెట్టారు జనం.

“ఈ రైలుబళ్ళు యింతేనండి బాబూ. నా చిన్నప్పట్నించీ చూస్తున్నాను. ఎక్కడ ఎంతసేపు ఎందుకు ఆగిపోతాయో ఆ పరమాత్ముడిక్కూడ అంతుబట్టదు- అర్జంటు కేసొకటి తగిలి కోర్టుకెళ్ళాల్సి వచ్చింది- ఇలా చిక్కుకుపోయాను” విసుక్కున్నాడో కోర్టుపక్షి-

“మీ కోర్టు కేసులంటే వాయిదాలేగా! ఫర్వాలేదు. మరి నా మాటేమిటి? రెండేళ్ళు ఉద్యోగంకోసం ఎదురుచూసి చూసి, రెండు నెలలు కష్టపడి ప్రిపేరయ్యేను- ఈరోజే యింటర్వ్యూ- రాత్రి పదింటికే దిగిపోతానుగదా, రాత్రి రెస్టు తీసుకుని తెల్లారి యింటర్వ్యూకి వెళ్ళొచ్చనుకున్నాను- ఇప్పటికైనా ఏ బస్సో పట్టుకుని పోవాలి. యీ వూరికి బస్సు

పడిందో లేదో" అంటూ సంచితీసుకుని బయల్దేరాడో కుర్రాడు.

"ప్రయాణాలన్నీ ఘోరంగానే వున్నాయిలెద్దురూ- బయల్దేరిన వాళ్ళు గమ్యం చేరుకుంటారన్న గేరంటీ లేదు. ఎడ్లబళ్ళనించి ఏరోప్లేన్లవరకూ అలాగే ఏడుస్తున్నాయి" అన్నాడు విప్రుడు సందు చూసుకుని అక్కడ పీఠంవేసి-

"ఇంతకీ ఏక్సిడెంటేమైనా అయిం దంటారా?"

పళ్ళు తోముకుంటూనే అడిగాడో కాకీబట్టల కన్నారావు.

అశుభ్రంగా వున్న వాడివైపు అసహ్యంగా చూసి, జవాబు చెప్పకుండా తల తిప్పుకున్నడా విప్రుడు - ఇంతలో తెల్లబట్టలేసుకున్న రైల్వే మార్కు గార్డు ఒకాయన అటుగా రావడంతో ఓ పది మంది ఆయన్ను చుట్టుముట్టి ప్రశ్నలేసి, వేధించి కొంత సమాచారాన్ని రాబట్టారు-

"అదండీ సంగతి! స్వాతంత్ర్యం వచ్చాక మన జనాల్లో చైతన్యం పోయిందంటారు - చూడండి మన వాళ్ళిప్పుడు ఎలా విజృంభించారో" అన్నాడో రాజకీయ మార్కు ఖద్దరు చొక్కా -

"ఏమైందటా?"

"ఏవుందీ - ప్రక్క స్టేషన్లో ఎక్స్ ప్రెస్ బళ్ళు ఆపటంలేదని అక్కడి ప్రజలు ఏడాదయి అర్జీలు పెట్టుకున్నా అటు ప్రభుత్వంవారుగాని యిటు రైల్వే వారుగాని పలకలేదట- ఇప్పుడు వాళ్లంతా ఏకమై బలవంతంగా అన్ని బళ్ళనూ ఆపుజేయిస్తున్నారు-పోలీసు బందోబస్తూ; పట్టాలు పీకడం, లాఠీచార్జీ-మామూలే!"

"ఇంతకీ మన మీ రోజు కదుల్తామో లేదో?"

"ఎవడి కెరుక?"

ప్లాట్‌ఫాం మీద జనం పల్చబడి మళ్ళీ సూరీడు కొట్టుముందు మూగేరు.

"ఇదిగో అబ్బాయ్. ఇడ్లీ వచ్చిందా?" ఇందాకటి ఆసామీ మళ్ళీ పిల్లలతో సహా వచ్చి అడిగాడు-

"వచ్చి అయిపోయాయండీ." జవాబు చెప్పి టీ కలపడంలో నిమగ్నమయ్యాడు సూరీడు.

"అలాగంటే ఎలాగయ్యా. ఉదయం నించి పిల్లలు ఆకల్తో ఏడుస్తున్నారు- పోనీ యింకేమున్నా కొందామన్నా కొండ ముండా స్టేషన్‌లో మరేం దొరికి చావదాయె." విసుకున్నాడతను.

"నానేం సెయ్యనండీ? ఉంటే బేరం ఒగ్గేస్తానా? నూకకోసు పూళ్ళోకి పునిషి నంపేను- ఒస్తే ఓ అరగంటలో ఉప్మా తయారౌద్ది-" సౌమ్యంగానే సమాధాన మిచ్చాడు సూరీడు.

"అవును మరి! అతను మాత్రం ఏంచేస్తాడూ. ఊహించని పరిస్థితి - ఇంతమందికి టిఫిన్లూ, టీలూ అందించా లంటే మాటలా?" చాలమంది సూరీడు మీదే అభిమానం చూపేరు-

పదకొండు గంటలయింది—

ఎండ కణకణలాడుతోంది– మసారి పోతున్న నిప్పులమీద కాసిన్ని బొగ్గులేసి పొయ్యి పాక బయటపెట్టి గదిలో దూరి డబ్బు లెక్క చూసుకున్నాడు సూరీడు. అతడి కళ్ళు ఆనందంతో మెరిశాయి. ఎప్పుడూ లేనిది ఒక్క రోజులో యిరవై రూపాయలు లాభం !

సమయానికి పాలూ టీపొడీ ఉన్నాయి కాబట్టి ఆ టీనీళ్ళైనా కాచి నలుగురి ఆకలీ తీర్చాడు. తనూ లాభం పొందేడు– రోజూ ఏ బేరమొస్తుందా అని కాచుక్కూచునే టైమిది–

ఆ చిన్న స్టేషన్‌లో పాసింజర్ రైళ్ళూ గూడ్సు బళ్ళూ తప్ప మరేం ఆగవు–పాసింజర్ బళ్ళు పగటి పూట తక్కువ.

ఎప్పుడో ఏ బండో అనుకోకుండా ఆగాల్సి వస్తే బేరముంటుంది. లేకపోతే లేదు–

సూరీడు లోపల్నించి బయటకొచ్చాడు –రాజుకుంటున్న నిప్పుల మీద నీళ్ళు వేడెక్కుతున్నాయి.

"ఏముందయ్యా టిఫినూ ?"

"కొండముండా వూరందీ బాబూ"

"టీ నీళ్ళు కూడా లేకపోతే ఎలా ఛస్తామయ్యా. యాపారమంటూ కొట్టెట్టుకున్నాక యిలాగేనా వుండేదీ."

"సాయంత్రం వరకూ బళ్ళు కదిలేట్టు లేవు. ఇదే నీకూ అదును– నాలుగు సొమ్ములు చేసుకోడానికి–ఏదీ మా సంగతి చూడు మరి."



ఎవరికి తోచిన మాట వారంటూనే వున్నారు– అందరి మాటలు వింటూ సమాధానాలిస్తూనే ఒక ప్రక్క ఆలోచిస్తున్నాడు సూరీడు.

అతనికి తట్టిన ఆలోచనకు చుక్కమ్మ 'సై' అంది.

అంతే! కుర్రాడిని పిల్చి డబ్బులూ, సైకిలూ యిచ్చి వూళ్ళోకి పంపించి పెద్ద పొయ్యి వెలిగించి అరుబయట పెట్టేడు - రాక్షసబొగ్గు అంటుకుంటూ చిమ్మిన పొగలు దరిద్రంలా పాకని చుట్టుముట్టేయి. ఆ పొగపోయి నిప్పు కణకణలాడ్డాని కింకా పావు గంటైనా పడుతుంది.

మనసులో సంతోషం ఉరకలు వేస్తుండగా ఆలోచనలో పడ్డాడు సూరీడు-

ఏడాదిక్రితం.... చుక్కమ్మ కాపరాని కొచ్చిన నాలుగు నెలలనాడు - ఇలాగే పాక బయట కూర్చున్నాడు ఏంచేయాలో తోచక -

తాతలు తండ్రులు దున్నుకున్న భూములన్నీ అప్పులకీ వడ్డీలకీ జమకట్టబడి తమ తరానికి మాత్రం రెక్కలే మిగి లాయి- పట్నమెళ్ళాలా పల్లెలోనే పడుండాలా అని ఆలోచనలో పడ్డాడు-

ఆ రోజూ యిలాగే ఏదో కారణంవల్ల బళ్ళు ఆగిపోయాయి- జనమంతా ఆకలికి చుట్టుకుపోయారు. అనుకోకుండా ఆ రోజు మొదలయ్యిందీ టీ వ్యాపారం. ఆ రోజు వచ్చిన లాభం సూరీడు యిప్పటికీ మర్చిపోలేదు-అ తర్వాత అదే బాగుందనికుని అందులోనే స్థిరపడ్డాడు.

తిండికి లోటులేకుండా గడిచిపోతోంది-

సైకిల్ వెనుక మూటా; హేండిల్ బారుకి సిల్వర్ కేరేజీతో దిగేడు కుర్రాడు- చుక్కమ్మ పెట్టిన ఎసరు అప్పటికే కళ పెళలాడుతోంది- దిగ్గున లేచి బియ్యపు మూటనీ, పెరుగు కేరేజీనీ అందు కున్నాడు సూరీడు-

పని చకచకా సాగింది- మొదటి విడత వండిన అన్నం పాతిక పెరుగు పొట్లాలై క్షణంలో అమ్ముడై పోయాయి. అనుకున్న దానికంటె ఎక్కువే వచ్చింది లాభం. కానీ జనం యింకా పొట్లాల కోసం ఎగబడుతూనే వున్నారు- ఎండ మండుతోంది- రైలుబళ్ళు రెండూ యింకా సొమ్మసిల్లే వున్నాయి-అవెప్పుడు కదుల్తాయో ఆ ఈశ్వరుడు కూడ వూహించేట్టులేదు- జనం కేకలూ; అరుపులూ-

ఇంకా స్త పెద్దగిన్నె పొయ్యిమీద కెక్కించింది చుక్కమ్మ-

కేరేజీ, సైకిలూ పట్టుకుని వూళ్ళో కెళ్ళాడు కుర్రాడు. పాకముందు సూరీడు హడావుడిగా తిరుగుతున్నాడు-

'అదురుష్టం కలిసొస్తే ఎవడడ్డగలడు' గిన్నెలో ఉడుకుబట్టిన బియ్యం వంక చూస్తోంది చుక్కమ్మ.

అంతే! ఒక్కసారి జనంలో కల కలం ఎక్కువయింది-

కేకలూ; అరుపులూ; పరుగులూ-

సూరీడు గుండెలు గుభేల్మన్నాయి- తగువు తేలిందో ఏమో దూరంగా సిగ్నల్ రెక్క వాలింది- కొద్ది నిముషాల వ్యవధిలో రెండు బళ్ళూ కదిలాయి- జనం ఆనందానికి అవధుల్లేవు-

బళ్ళు వెళ్ళాక బోసిపోయిన ప్లాట్ ఫాంమీద వేలాడిన రెక్కలావున్న సూరీడి వంక నీళ్ళు నిండిన కళ్ళతో చూసింది చుక్కమ్మ.

సూరీడు వాలిన రెక్క వంకే అచేతనంగా చూస్తున్నాడు- పొయ్యిలో బొగ్గులు కణకణలాడుతూ ఎర్రగా మండుతూనే వున్నాయి.

———